


నవతరం
తెలుగు దినపత్రిక
విలువలే మీ రాజకీయ ఆస్తి
ప్రజలే మీ జీవిత లక్ష్యం
పదవులు మారినా
నిబద్ధత మారలేదు
కాలం మారినా
విలువలు మారలేదు
ఒక నాయకుడికి కాదు
ఒక ప్రమాణానికి
శ్రీకాకుళం నేల
గర్వంగా చెప్పుకునే
నిస్వార్థ నాయకుడికి
ప్రజల హృదయాల నుంచి
వినమ్ర నివాళులు
జననం : 16-01-1948
మరణం : 12-01-2026
కీ.శే. శ్రీ గుండ అప్పలసూర్యనారాయణ గారు
మాజీ మంత్రివర్యులు
మీ ఆలోచనలు, మీ ఆదర్శాలు, మాకు మార్గదర్శకం
మీ మేనల్లుడు అంబటి శివ

# నవతరం

RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 82 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
22-01-2026 గురువారం వెల : 1 /- పేజీలు : 4

## అరసవల్లి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- హోం మంత్రి అనిత
- భక్తుల భద్రతే ముఖ్యం.. అధికారులకు దిశానిర్దేశం



**నవతరం -శ్రీకాకుళం**

అరసవల్లి క్షేత్రంలో జరిగే రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా ఆమె జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రానున్న ఉత్సవాల ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఉన్నతాధికారులతో కలిసి ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లను క్రమబద్ధీకరించాలని, ముఖ్యంగా ట్రాఫిక్ మళ్లింపు విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి సూచించారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, పోలీసు, రెవెన్యూ విభాగాల మధ్య సమన్వయం ఉంటేనే ఉత్సవాలను దిగ్విజయం చేయగలమని ఆమె పేర్కొన్నారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, రథసప్తమి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. అనంతరం జిల్లాలోని ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితిపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. అంతకుముందు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న హోం మంత్రికి జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, శ్రీకాకుళం శాసనసభ్యులు గోండు శంకర్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతర కృషి

గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**నవతరం -నిమ్మాడ**

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత శాఖలకు పంపించి తక్షణమే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.
ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వివరించగా, మంత్రి సావధానంగా విని సానుకూలంగా స్పందించారు.
ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.
"ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని, వాటిని క్షేత్రస్థాయిలో రిష్కరించడమే మా లక్ష్యం. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా ఉంటుంది" అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నాలుగు మండ?లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తుల భద్రతే పరమావధి.. రథసప్తమి ఏర్పాట్లు పటిష్టం

- కోడి రామ్మూర్తి స్టేడియం, అరసవల్లి క్షేత్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- కె ఆర్ స్టేడియం ప్రధాన ద్వారం వద్ద అదనపు లైన్లు.. అరసవల్లి క్యూలైన్లలోనే టికెట్ల స్కానింగ్
- తమన్ మ్యూజికల్ షోకు పకడ్బందీ బారికేడ్లు



**నవతరం -శ్రీకాకుళం**

అరసవల్లి రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, ప్రవేశ, నిష్క్రమణ పాయింట్ల వద్ద అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి కోడి రామ్మూర్తి స్టేడియం, అరసవల్లి ఆలయ పరిసరాల్లో జరుగుతున్న తుది ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు.తొలుత కె.ఆర్. స్టేడియాన్ని సందర్శించిన అధికారుల బృందం, అక్కడ ప్రవేశ మార్గం వద్ద సింహద్వారం వెడల్పు తక్కువగా ఉండటాన్ని గమనించారు. వెంటనే అక్కడి మెట్లను తొలగించి, భక్తుల రద్దీకి అనుగుణంగా అదనంగా మరో నాలుగు క్యూలైన్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్, ఫైర్ ఇంజిన్లు మైదానం నుంచి నేరుగా మెయిన్ రోడ్డుకు వెళ్లేలా ప్రత్యేక మార్గాన్ని సిద్ధం చేయాలన్నారు. స్టేడియం అంతటా వెలుతురు సరిగ్గా ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని, అడ్డదిడ్డంగా ఉన్న విద్యుత్ వైర్లను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. పార్కింగ్ కోసం ఆర్.సి.యం స్కూల్ గ్రౌండ్‌ను కేటాయించారు.సంగీత విభావరికి ప్రత్యేక నిఘా..ఈ నెల 24న జరగనున్న తమన్ సంగీత విభావరికి వేల సంఖ్యలో యువత, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున, గ్యాలరీల వద్ద బారికేడ్లను అత్యంత పటిష్టంగా నిర్మించాలని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి సూచించారు. తోపులాటలు జరగకుండా ఎంట్రీ, ఎగ్జిట్‌ల వద్ద పోలీసు బందోబస్తును పెంచాలన్నారు.అరసవల్లిలో 'స్కానింగ్' నిఘా..అక్కడి నుంచి అరసవల్లి వెళ్లిన అధికారులు, ఇప్పటికే రూపొందించిన రూట్ మ్యాప్ ఆధారంగా అన్ని సెక్టార్లను కలియతిరిగారు. ప్రత్యేక ప్రవేశ రూ. 100, 300, 500 టికెట్ల క్యూలైన్ల ప్రారంభంలోనే స్కానర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టికెట్ లేని వారు పొరపాటున ఆయా లైన్లలోకి ప్రవేశించి ఇబ్బందులు పడకుండా ముందే కట్టడి చేయాలని నిర్ణయించారు. రద్దీ ఎక్కువగా ఉన్న చోట్ల భక్తులను ఇతర మార్గాలకు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. క్యూలైన్ల మధ్య బారికేడ్లు ఎక్కడా ఇబ్బంది లేకుండా, భక్తుల ఒత్తిడికి తట్టుకునేలా పటిష్టంగా ఉండాలని స్పష్టం చేశారు.సామాన్య భక్తుడికి పెద్దపీట వేస్తూ, అరగంటలోనే దర్శనం పూర్తయ్యేలా చేయడమే తమ లక్ష్యమని, అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్, ఆర్ అండ్ బి, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిస్వార్ధ సేవకులు అంధవరపు సూరిబాబు



- మెరుగైన సమాజాన్ని నిర్మించాలనేదే అందవరపు.సూరిబాబు జీవితాసాయం
- శర్వాణి విద్యాలయ కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు

**నవతరం -శ్రీకాకుళం**

నగరంలోని అరసవల్లిరోడ్డులో గల శర్వాణి విద్యాలయలో సంస్థ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు జన్మదినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జన్మదినోత్సవ సభలో శర్వాణి విద్యాలయ కరస్పాండెంట్ ఎ. ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నో జన్మల పుణ్యఫలమే మానవ జన్మని, జీవితంలో ఎంత ఎక్కువ కాలం జీవించాం అనేదానికంటే, ఎంత గొప్పగా జీవించామనేదే ముఖ్యమని, 10 మందికి ఉపయోగపడేటట్లుగా జీవించడమనేది భగవంతుడు ప్రసాదించిన వరమని అన్నారు. అటువంటి నిస్వార్ధ సేవ చేసే **-మిగతా 3లో**

## మనదేశంలో వ్యవసాయం తర్వాత రెండో స్థానంలో ఉన్నది చేనేత పరిశ్రమలు

ఉత్తరాంధ్ర చేనత చైతన్య సభలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్ 4లో



# మహిమాన్వితం మాఘమాసం



చాంద్రమానం ప్రకారం పదకొండవ మాసం "మాఘ మాసం". ఈ మాసంలోని పూర్ణిమనాడు చంద్రుడు మఖ నక్షత్ర సమీపంలో సంచరించడం వల్ల ఈ మాసానికి "మాఘమాసం" అనే పేరు ఏర్పడింది. ఈ మాసంతో ఆరు ఋతువులలో చివరిదైన "శిశిర ఋతువు" ప్రారంభమవుతుంది. చదువుల తల్లి, అక్షరాల అధిదేవత అయిన శ్రీ సరస్వతీ దేవి జన్మించిన, ఈ చరాచర ప్రపంచానికంతటికి వెలుగునూ, చైతన్యాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ వున్న ప్రత్యక్షదైవుడైన శ్రీ సూర్యభగవానుడు జన్మించిన, త్రిమూర్తులలో లయకారుడైన పరమశివుడు లింగోద్భవ మూర్తిగా ఆవిర్భవించిన మహిమాన్వితమైన మాసం "మాఘమాసం'. అటువంటి ఈ మాస మహత్యాన్ని గురించి పూర్వం శివుడు పార్వతీదేవికి, బ్రహ్మదేవుడు నారదమహర్షికి, వశిష్ఠ మహర్షి దిలీపుడికి, దత్తాత్రేయుడు కార్తవీర్యార్జునుడికి ఉపదేశించినట్లు పురాణాలు వెల్లడిస్తూ ఉన్నాయి. రోజుకు సంధ్యాసమయం ఎలాగో సంవత్సరానికి మాఘమాసం అలా సంఖ్యా సమయం వంటిది. పుణ్యప్రదమైన కాలం. పవిత్రమైన కాలం, జన్మజన్మల పాపాలను పటాపంచలు చేసి మోక్షాన్ని ప్రసాదించే మాసంగా పేరుపొందిన మాఘమాసంలో ప్రతిదినమూ పుణ్యదినమే. సంవత్సర కాలం మొత్తం చవితి, షష్ఠి, సప్తమి, ఏకాదశి, చతుర్దశి, పూర్ణిమ వంటి పుణ్య తిధుల్లో ఆచరించిన విధులవల్ల కలిగే ఫలితం ఈ ఒక్క మాఘమాసాన్ని ఆచరించడం వల్ల కలుగుతుందని పురాణ కథనం. ప్రతిరోజూ తెల్లవారు ఝామునవే మాఘస్నానం ఆచరించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. అప్పుడే అది మాఘమాసం అవుతుంది. తెల్లవారు ఝామున నక్షత్రాలు వుండగా స్నానం చేయడం ఉత్తమం. నక్షత్రాలు లేని సమయంలో స్నానం చేయడం మధ్యమం. సూర్యోదయం తర్వాత స్నానం చేయడం నిష్ఫలం అని చెప్పబడింది. అందులోనూ నదీ స్నానం ఉత్తమమైనది. అందుకు అవకాశంలేని స్థితిలో గంగా గోదావరి వంటిపుణ్యనదులను స్మరిస్తూ కాలువల్లో గానీ, చెరువుల్లోగానీ, బావుల వద్దగానీ స్నానం చేయవలెను. అందుకు కూడా అవకాశం లేని వారు బోరు బావులవద్దగానీ, కుళాయిల వద్దగానీ, ఇంటిలోగానీ పవిత్రమైన నదులను తలుచుకుంటూ స్నానమాచరించవలెను. లి"దుఃఖ దారిద్ర్య నాశాయ



శ్రీవిష్ణోస్తోణాయచ ప్రాతఃస్నానం కరోమ్యద్య మాఘే పాపవినాశమ్ మకరస్తే రవౌ మాఘే గోవిందాచ్యుత మాధవ స్నానేనినే నమోదేవ యధోక్త ఫలదోభవలి" అనే శ్లోకాన్ని పఠిస్తూ స్నానమాచరించవలెను. ఈ మాసంలో గంగానదీ స్నానం అందులోనూ ప్రయాగలోని 'త్రివేణీ సంగమం'లో స్నానం చేయడం మహోన్నతమైన ఫలితాలనిస్తుందని సాస్త్ర వచనం. మాఘస్నానాలను పుష్య బహుళ అమావాస్య అంటే మాఘమాసం ప్రారంభం రోజుకంటే ముందు రోజునుంచీ ప్రారంభించాలని చెప్పబడింది. ఈ మాసమంతా మాఘస్నానం చేయడం ఉత్తమం. అందుకు అశక్తులైన వారు కనీసం మూడు రోజుల్లోనైనా చేయవలెను. మాఘమాసంలోని శుక్లపక్షంలో పాడ్యమి, విదియ, తదియ రోజుల్లోగానీ, త్రయోదశి, చతుర్దశి, పూర్ణిమ రోజుల్లోగానీ చేయవలెను. అందుకు కూడా వీలుకాకుంటే మాఘపూర్ణిమనాడు తప్పక ఆచరించవలెను. ఈ విధంగా మాఘ స్నానం ఆచరించడం వల్ల లెక్కలేనన్ని శుభఫలితాలు కలుగుతాయి. సూర్యభగవానుడు మకర రాశిలో వుండగా చేసే స్నానం పాపవిముక్తులను చేస్తుందనీ... మొదటిరోజు స్నానం వల్ల సర్వపాపాలు నశిస్తాయనీ, రెండవ రోజు స్నానం వైకుంఠ ప్రాప్తిని ప్రసాదిస్తుందనీ, తర్వాత చేసే స్నానాలు శ్రీ మహావిష్ణువే మనకు ఋణ గ్రస్తుడయ్యేటట్లు చేస్తాయని పురాణ వచనం. స్నానానంతరం శ్రీమహావిష్ణువును ఇష్టదేవతలను పూజించవలెను. ఈ మాసంలో విష్ణుపూజ, వైష్ణవాలయాలను దర్శించడంతోపాటు విష్ణు సహస్ర నామ పారాయణం చేయడం వల్ల మంచి ఫలితాలు కలుగుతాయి. ప్రత్యక్ష భగవంతుడైన శ్రీ సూర్యభగవానుడికి మాఘమాసం అత్యంత ప్రీతికరమైనది. ఈ నెలలో ప్రతిరోజు సూర్యాష్టకం, ఆదిత్య హృదయాలను పఠించడం, ఆదివారాల్లో క్షీరాన్నమును నివేదించవలెను. అంతేకాకుండా మాఘ మాసంలో ఆదివారం రోజుల్లో తరిగిన కూరగాయలను అంటే కత్తితో కోసిన కూరగాయలను భుజించరాదు. మాఘ మాసంలోనే శివుడు లింగోద్భవ మూర్తిగా ఆవిర్భవించాడు. కనుక శివపూజలకు ఈ మాసం ఉత్కృష్టమైన మాసం. ఈ నెలలో శివుడిని అభిషేకించడంతోపాటు మారేడు దళములతో పూజించడం, శివాలయంలో ప్రదోష సమయంలో నువ్వుల నూనెతో దీపాలను వెలిగించడం సకల శుభాలను ప్రసాదిస్తుంది. మాఘ మాసంలో చేసే దానాలు అనంతమైన పుణ్య ఫలాలను కలిగిస్తాయి ప్రధానంగా నువ్వులను దానం చేయడం ఉత్తమం. కంచు పాత్రలో నువ్వులను పోసి ఆ పాత్రను బ్రాహ్మణునికి దానం ఇవ్వాలి. మాఘ శుక్ల పక్షంలో చతుర్దశి కానీ మరేదైనా రోజు కానీ పండితులకు వస్త్రాలు, దుప్పట్లను పాదరక్షలను దానం చేయాలి. సప్తమి నాడు గుమ్మడికాయ దానం చేయాలి. ముఖ్యంగా పౌర్ణమి నాడు పాయసంలో దానం చేయాలని శాస్త్రవచనం మాఘ పౌర్ణమి నాడు బ్రహ్మవైవర్త పురాణమును దానం చేయడం వల్ల,ఇహలోకంలో సౌఖ్యం, మరణాంతరం బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుందని శాస్త్రాల్లో వివరించబడింది. మాఘ పురాణం పారాయణం చేయడం సత్ఫలితాలని ఇస్తుంది.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# నిస్వార్థ సేవకులు అంధవరపు సూరిబాబు

మొదటి పేజీ తరువాయి

మహాభాగ్యం తమ సంస్థ అధినేత అంధవరపు సూరిబాబుకు దక్కిందని, దానికి ఆయన సార్థకత చేకూర్చారన్నారు. ఒక సంపూర్ణ పాఠశాలలో జీవితాశయమని, ఆ ఆశయానికి అనుగుణంగా శర్వాణి విద్యాలయను తీర్చిదిద్దారని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం సహకారంతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సంస్కారాన్ని సమాజ సమృద్ధికి ఏమికావాలో దానిని విద్యార్థులకు అందించాలనేది, తద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించాలనేది సూరిబాబు అందించగల్గుతున్నామన్నారు. కార్యక్రమములో ప్రిన్సిపాల్ డా.కె. రేఖ మాట్లాడుతూ తమ సంస్థ వ్యవస్థాపకులు సూరిబాబు పేదలపక్షపాతి అని, ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో పోటీ ప్రపంచానికి సరిపడే రీతిలో విద్యార్థులను తీర్చిదిద్దేటట్లు శర్వాణి విద్యాలయ మౌళిక స్వరూపాన్ని నిర్మించారని ఆయన ఆశలయాల సాధనే పరమావధిగా తామంతా పనిచేస్తున్నామని తెలియజేసారు. సమాజశ్రేయస్సే తన బాధ్యతని, గుర్తెరిగి అనుక్షణం పేద, మధ్యతరగతి వర్గాలవారికి ఆలంబనగా లాభాపేక్షలేని విద్యను అందించడమే సూరిబాబు ఆశయంగా పెట్టుకున్నారని తదనుగుణంగానే శర్వాణి విద్యాలయలో విద్యతోపాటు అనేక విద్యేతర కార్యక్రమాలను విద్యార్థులు వారి తల్లిదండ్రులపై ఎటువంటి ఆర్థికభారం లేకుండా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా వడ్డి మోహనరావు, వడ్డి వైకుంఠరావుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరసవిల్లిలోని శ్రీ వాసవి వైశ్య అన్నదాన సత్రంలో జరుగుతున్న నిత్యఅన్నదానం కార్యక్రమానికి విరాళంగా 10,000/- రూపాయలు అందజేసారు. అలాగే 2026 మార్చిలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయబోతున్న వివిధ పాఠశాలలకు చెందిన ఇంగ్లీషు మీడియం కళింగవైశ్య విద్యార్థులకు మరింత మెరుగైన ఫలితాలకు దోహదపడే స్టడీమెటీరియల్ను వితరణ చేసారు. చేపల వీధిలోని నగరపాలక బాలికోన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులకు ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పరీక్ష కిట్స్ను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమములో సూరిబాబు మిత్రులు, శ్రేయోభిలాషులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఛాంపియన్ సరసన ప్రీతి ముకుందన్

కన్నప్ప సినిమా గుర్తుందిగా. ఆ సినిమాలో మంచు విష్ణు సరసన నటించిన హీరోయిన్ నే ప్రీతి ముకుందన్. ఇప్పుడు తెలుగులో మరో చాన్స్ అందుకుంది. ఛాంపియన్ హీరో రోషన్ సరసన నటించబోతోంది. శైలేష్ కొలను డైరక్షన్ లో సితార సంస్థ రోషన్ తో ఓ మంచి లవ్ స్టోరీ నిర్మించబోతోంది. ఆ సినిమాకు హీరోయిన్ గా ప్రీతి ముకుందన్ ను ఫైనల్ చేసారు. రోషన్ సరసన ప్రీతి ముకుందన్ పెర్ఫెక్ట్ జోడీ అవుతుందని మేకర్లు భావిస్తున్నారు. ప్రీతి ముకుందన్ కు ఇది మూడో తెలుగు సినిమా. మొదట ఓంభూమ్ బుష్ సినిమా చేసారు. తరువాత కన్నప్ప లో నటించారు. ఇది మూడో సినిమా. ఇప్పటి వరకు యాక్షన్ జానర్ లో సినిమాలు తీసిన శైలేష్ కొలను ఫస్ట్ టైమ్ యాక్షన్ తగ్గించి లవ్.. రొమాంటిక్ జానర్ లో సినిమా చేయబోతున్నారు. ఛాంపియన్ సినిమాకు మంచి టాక్ వచ్చినా, బాక్సాఫీస్ దగ్గర ఫెయిల్ అయింది. కానీ రోషన్ బాగా నటించాడు, స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది అనే మంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది. అందువల్ల ఈసారి కచ్చితంగా మంచి కొట్టే పనిలో భాగంగా సితార సంస్థతో సినిమా చేస్తున్నాడు.

# చిరంజీవి.. మోహన్ లాల్.. కృతి శెట్టి

తన తదుపరి చిత్రానికి మరింత భారీ సెటప్ తో రాబోతున్నారు చిరంజీవి. బాబి దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి చిరు అంగీకరించిన సంగతి తెలిసిందే. ఇందులో ఓ కీలక పాత్ర కోసం కృతి శెట్టిని తీసుకున్నారు. చిరంజీవి-కృతి శెట్టి కాంబినేషన్ ఏంటని ఆలోచిస్తున్నారా? కూతురు సెంటిమెంట్ తో రాబోతున్న ఈ సినిమాలో చిరంజీవి కూతురుగా కృతి శెట్టి కనిపించనుంది. తెలుగులో సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న ఈ హీరోయిన్, ఇప్పుడిలా ఓ కీలక పాత్రకు ఓకే చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సినిమాలో చిరంజీవి సరసన హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ ను జల్లెడ పట్టే పనిలో ఉన్నాడు బాబి. నయనతార, తమన్న లాంటి వాళ్లను కూడా. రవీనా టాండన్ లాంటి సీనియర్ నటిని ప్రాజెక్టులోకి తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నాడు. ఇక ఈ సినిమాలో మరో కీలక పాత్ర కోసం ఇప్పటికే మోహన్ లాల్ ను సంప్రదిస్తున్నట్టు తెలుస్తోంది. ఇలా భారీ సెటప్ తో చిరంజీవితో సినిమాను ప్లాన్ చేస్తున్నాడు డైరక్టర్ బాబి. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఈ సినిమా రాబోతోంది.





## అరినం అక్కివలసలో పశు ఆరోగ్య శిబిరాలు

నవతరం-ఎచ్చెర్ల



శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలో అరినం అక్కివలస గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాలు పెట్టి వీటిలో పశువులకు చికిత్స చేసి టీకాలు వేసి ఆరోగ్య సలహాలు ఇచ్చారు రైతులకు బీమా పశుగ్రాస సహాయం వంటి ప్రోత్సాహకాలు అందించారు తద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధికి దోహదపడతాయి డాక్టర్ రమణ గారు తెలిపారు అలాగే 1962 వెటర్నర్ అంబులెన్స్ లో ఉన్న మందులు ఇచ్చారు 1962 వెటర్నరీ అంబులెన్స్ డాక్టర్ లక్ష్మీప్రసన్న గారు పాడి రైతులు కు పాలు దిగుబడి పెంపు కోసం తెలియజేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ రమణ గారు 1962 వెటర్నరీ అంబులెన్స్ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న వి.ఏ. శ్రీనివాసరావు ఎల్.ఎస్.ఏ నవీన్ కుమార్ వెటర్నరీ అంబులెన్స్ స్టాఫ్ మరియు గోపాల మిత్రలు తదితరులు పాల్గొన్నారు పశు ఆరోగ్య శిబిరాలు వల్ల పాడి రైతులుకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

## దామోదర్ పట్నాయక్ నేత్రదానం మహోన్నతం

నవతరం-శ్రీకాకుళం



నేత్రదానం చేయడం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అదృష్టాన్ని కల్పించవచ్చని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. జిల్లాలోని మంగువారితోటకు చెందిన సాలిహుండం దామోదర్ పట్నాయక్ (44) మృతి చెందగా, వారి నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ప్రతినిధులు కార్నియాలను సేకరించి, విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ ఐ బ్యాంక్‌కు అందజేశారని తెలిపారు. ఈ బృహత్తర కార్యంలో భాగస్వాములైన మృతుని భార్య షర్మిల, కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, ఆసక్తి ఉన్నవారు 78426 99321 నంబరును సంప్రదించాలని కోరారు.

## లవంగాలు ఆరోగ్యానికి ఎంతో మంచిది



లవంగాలు ఆరోగ్యానికి ఎంతో మంచిది .. ఆ వివరాల్లేంటో ఈ రోజు ప్రసారం అయ్యే ఆరోగ్యమే మహాభాగ్యంలో తెలుసుకుందాం..లవంగాలలో ఫైబర్, మాంగనీస్, విటమిన్ జ, ఖ ఉన్నాయి. మాంగనీస్ మెదడు పనితీరును పెంచుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎముకలు గట్టి పడటానికి ఉపయోగపడుతుంది. విటమిన్ జ ఖ రోగ నిరోధకతను పెంచుతాయి. అదే విధంగా రక్తం గడ్డకట్టడానికి సహాయపడుతాయి. లవంగాలలో యాంటీమైక్రోబియల్ లక్షణాలు పుష్క?లంగా ఉన్నాయి. ఇవి తిమ్మిర్లు, అలసట, అతిసారం లాంటి రుగ్మతలకు కారణమైన బ్యాక్టీరియా పెరుగుదలను నియంత్రించడంలో సహాయపడుతుంది. లవంగాలలో ఉన్న యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలు పూర్తి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఎందుకంటే, అంటు వ్యాధులకు కారణమైన బ్యాక్టీరియా పెరుగుదలను అడ్డుకునే సామర్థ్యం వీటిలో ఉంది. ఇంతే కాదు, లవంగాల వల్ల మీకు ఎన్నో ప్రయోజనాలున్నాయి. లవంగం నూనె బ్రాంకైటిస్, ఆస్తమా, ఇతర శ్వాసకోశ సమస్యలను, జలుబు దగ్గు వంటి వాటిని తగ్గించడానికి ఉపయోగపడుతుంది. ఈ నూనె శ్వాస నాళాన్ని హాయి పరుస్తుంది . యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలను కూడా కలిగి ఉంది. లవంగం నూనెను ఛాతిపై, ముక్కుపై, ముక్కు చుట్టూ నెమ్మదిగా మర్దన చేస్తే చాలా ఉపశమనం కలుగుతుంది. కొన్ని లవంగాలను కొన్ని చుక్కల లవంగం నూనెను వేడి నీటిలో వేసి దాన్ని టీ లా తాగితే కొద్దిగా ఉపశమనం కలుగుతుంది. ప్రతీరోజూ ఇలా తాగితే నెమ్మదిగా శ్వాస సంబంధ సమస్యలు తగ్గుతాయి.ఒక లవంగ మొగ్గను నమలడం వల్ల గొంతు నొప్పి తగ్గుతుంది. నొప్పులు వాపులకు, కీళ్ల నొప్పులకు చక్కని నివారణ: లవంగాలలోని యుజెనాల్ అనే పదార్థానికి శక్తివంతమైన యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి.ఇవి లవంగం నూనెలో కూడా పుష్కలంగా ఉన్నాయి. లవంగాలు నోటి పూత గొంతు వాపులతో కూడా పోరాడుతుంది.రోజూ లవంగాలు తీసుకున్న వారిలో కేవలం 7 రోజుల్లో సైటోకిన్ స్థాయిలు తగ్గతాయి. ఈ సైటోకైన్లను తగ్గించడం వలన కీళ్ళనొప్పులు ఆర్థరైటిస్ గణనీయంగా తగ్గుతాయి.లవంగం నూనె శరీరం జీవక్రియను ప్రభావితం చేసి శరీర ఉష్ణోగ్రత తగ్గిస్తుంది రక్త ప్రసరణను మెరుగు పరుస్తుంది. లవంగాలలోని యాంటీఆక్సిడెంట్ లక్షణములు రక్త శుద్ధి సహాయపడవచ్చు. క్రమం తప్పకుండా లవంగాలు తీసుకోవడం వల్ల గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని చెప్పబడిన నైజీరిసిన్ అనే మరొక సమ్మేళనం లవంగాలలో ఉంది. అందువల్ల లవంగాలను ఆహారంలో చేర్చడం ద్వారా మధుమేహాన్ని తగ్గించవచ్చు. లవంగాలలోని కొన్ని సమ్మేళనాలు కడుపులోని అల్సర్లను తగ్గిస్తాయి. లవంగాల నుంచి వచ్చే నూనె గ్యాస్ట్రిక్ మ్యూకస్ మందం పెంచుతుంది. ఇది కడుపులో లైనింగ్ ను రక్షిస్తుంది సంబంధించిన అల్సర్లను నిరోధిస్తుంది. లవంగాలలో ఫైబర్ జీర్ణవ్యవస్థను మెరుగుపరచడానికి సహాయపడుతుంది మలబద్ధకం నిరోధించడానికి ఉపయోగపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు..

## దాతృత్వానికి నిలువెత్తు నిదర్శనం

- పూడివలసలో సింహద్వారం నిర్మించిన తంగి హరినారాయణ -సరోజినీ దంపతులు
- గ్రామ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన స్వగ్రామ సేవాభిమానులు
- రూ.4,16,000 స్వంత వ్యయంతో శ్రీ అసిరితల్లి అమ్మవారి ముఖద్వారం నిర్మాణం
- దంపతులకు కృతజ్ఞతలు తెలిపిన పూడివలస గ్రామస్తులు

(నవతరం ఎచ్చెర్ల)

పూడివలస గ్రామ ప్రజల చిరకాల కలను సాకారం చేస్తూ స్వగ్రామానికి చెందిన తంగి హరినారాయణ సరోజినీ దంపతులు తమ దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. గ్రామ ప్రధాన రహదారి వద్ద ఎంతో భక్తి శ్రద్ధలతో, తమ స్వంత ఖర్చుతో రూ.4,16,000 వ్యయంతో శ్రీ అసిరితల్లి అమ్మవారి ముఖద్వారంగా నిలిచే సింహద్వారాన్ని నిర్మించి గ్రామానికి చిరస్థాయిగా నిలిచే సేవ చేశారు.గ్రామ ప్రవేశంలో ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్మించిన ఈ సింహద్వారం పూడివలస గ్రామానికి ఒక ప్రత్యేక గుర్తింపుగా నిలవనుంది. ఎన్నో సంవత్సరాలుగా గ్రామస్తులు కోరుకుంటున్న ఈ ముఖద్వారం నిర్మాణం ద్వారా అమ్మవారి ఆలయానికి మరింత శోభ చేకూరింది. భక్తుల మనసుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేలా ఈ నిర్మాణం రూపుదిద్దుకుంది.ఈ నిర్మాణ కార్యక్రమంలో శిల్పిగా రాజు తన ప్రతిభను చాటుకోగా, రంగుల అలంకరణ బాధ్యతలను గొలివి అప్పలరాజు సమర్థవంతంగా నిర్వర్తించారు. సింహద్వారంపై చేసిన కళాత్మక పనితనం, రంగుల సమన్వయం గ్రామస్తులనే కాదు, అక్కడికి వచ్చే భక్తులను కూడా ఆకట్టుకునేలా ఉంది.ఇంతటి మోహోన్నతమైన, భక్తి పరవశమైన కార్యక్రమాన్ని చేపట్టిన తంగి హరినారాయణ సరోజినీ దంపతులు నిజంగా గ్రామానికి ఆదర్శప్రాయులని పూడివలస గ్రామ ప్రజలు ప్రశంసించారు. తమ స్వగ్రామం పట్ల ఉన్న ప్రేమ, భక్తి భావనలతో ఈ సేవను అందించిన దంపతులకు గ్రామస్తులు అందరూ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరుతూ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



ఎడిటోరియల్

## ఇరాన్‌పై వేలాడుతున్న అమెరికన్ కత్తి !

దాడులు చేస్తామన్న తన హెచ్చరికల కారణంగానే 800 మందిని ఉరితీసేందుకు నిర్ణయించిన ఇరాన్ వెనక్కు తగ్గిందని అమెరికా ప్రకటించింది. తామసలు అలాంటి ఆలోచనే చేయలేదని, తమ మీద యుద్ధానికి దిగితే ప్రతిఘటిస్తామని ఇరాన్ హెచ్చరించింది. సౌదీ అరేబియాతో సహా ఎవరూ మద్దతు తెలపకపోవటం, వ్యూహాత్మకంగా అయినా కావచ్చు అమెరికా ప్రస్తుతానికి వెనక్కు తగ్గిందని చెబుతున్నారు. బహుశా ఈ కారణంగానే కావచ్చు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించిన ఇరాన్? తిరిగి తెరిచింది. గురువారంనాడు భద్రతా మండలి అత్యవసర సమావేశం జరిపి ఇరాన్?లో ఉన్న పరిస్థితిని, అమెరికా బెదిరింపుల గురించి చర్చించింది. ఎవరికి వారు తమ ఎత్తుగడలతో ముందుకుపోతున్నారు. ఒకవైపు కొన్ని ప్రాంతాల నుంచి మిలిటరీ ఉపసంహరణ వార్తలతో పాటు మరింతగా బలగాలను సమీకరిస్తున్నదనే విషయాలు కూడా వెల్లడైనందున అమెరికా సామ్రాజ్య వాదుల మాటలను నమ్మటానికి లేదు. ఇరాన్ను, ప్రపంచాన్ని తప్పుదారి పట్టించేందుకు చూస్తున్నట్లుగా కనిపిస్తున్నది. తాము సంఘర్షణ కోరుకోవటం లేదని, అమెరికా గనుక దాడులకు దిగితే తగిన విధంగా స్పందిసామని, తమ దేశంలో ఆందోళనల వెనుక వాషింగ్టన్ హస్తం ఉందని భద్రతా మండలిలో ఇరాన్ ప్రతినిధి పేర్కొన్నాడు. నిరసనలకు టెహరాన్ పాలకులే కారణమని అమెరికా ఆరోపించింది తప్ప ట్రంప్ చెప్పినట్లుగా దాడులు జరుపుతామనే పదజాలం భద్రతామండలిలో లేదు. అక్కడ జరిగిన ఉదంతాల్లో 150మంది వరకు భద్రతా సిబ్బంది కూడా మరణించారని వస్తున్న వార్తలు నిజమే అయితే నిరసనలు ఒక పథకం ప్రకారమే జరిగినట్లు చెప్పవచ్చు. ఇంటర్నెట్ సేవలు నిలిపివేసినందున ప్రపంచ మీడియాలో వస్తున్న సమాచారమంతే అమెరికా కనుసన్నలలో నడిచే వార్తా సంస్థల కథనాలే గనుక వాటిని నమ్మటానికి లేదు. ఐరాస అధికారి కూడా అవునని, కాదని చెప్పలేమని పేర్కొన్నారు. అమెరికా యత్నాలను సౌదీ అరేబియా వ్యతిరేకించింది. ఇరాన్?లో ఇస్లామిక్? విప్లవం జరిగిన 1979 నుంచి అమెరికా ప్రభావంలో ఉన్న సౌదీ అరేబియా టెహరాన్?తో శత్రుపూరిత సంబంధాలలో ఉంది. చైనా మధ్యవర్తిత్వంలో 2023లో రెండు దేశాలూ సాధారణ సంబంధాలు నెలకొల్పుకున్నాయి. ఇరాన్‌లో జరుగుతున్న ఆందోళనలు దాని అంతర్గత అంశమని, అక్కడి పాలకులను మార్చాలా లేదా అనేది ఇరానియన్లు నిర్ణయించుకోవాలి తప్ప వేరేవారెలా నిర్ణయిస్తారని సౌదీ విదేశాంగ మంత్రి జుబేర్ ప్రశ్నించటం ఒక కీలక పరిణామంగానూ, ఈ వైఖరి కారణంగా ట్రంప్ వెనక్కి తగ్గినట్లు కూడా చెబుతున్నారు. ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ విపరీతంగా పతనం కావటంతో ఆందోళన వెలిబుచ్చుతూ రాజధాని టెహరాన్ గ్రాండ్ బజార్ వర్తకులు డిసెంబరు 28న ప్రారంభించిన ఆందోళన దేశమంతటికీ విస్తరించింది. మన ఒక రూపాయికి 465 ఇరానియన్ రియాల్స్ సమానం. నిరసనలను ఉక్కుపాదంతో అణచివేసినట్లు వందలాది మంది మరణించినట్లు వచ్చిన వార్తలు సందేహాస్పదంగా ఉన్నాయి. అయితే ఇరాన్ పాలకులు అణచివేతకు పెట్టింది పేరు గనుక అసలేమీ జరగలేదని అనుకోరాదు. గతమంతా ఘనంగా ఉన్నట్లు ఇప్పటి పాలకులే ప్రాణాలు తీస్తున్నట్లు పశ్చిమదేశాల మీడియా చిత్రిస్తున్నది.
మహమ్మద్ రెజా పహ్లావీ రాజుగా ఉన్న సమయంలో తన ప్రభుత్వాన్ని వ్యతిరేకించిన వారిని, తిరుగుబాటు చేసిన వారిని 60వేల మంది వరకు చంపివేసినట్లు 1979లో అధికారానికి వచ్చిన ఇస్లామిక్ ప్రభుత్వం ప్రకటించింది. మాజీ రాజు వారసుడు 17 సంవత్సరాల రెజా పహ్లావీ విప్లవ సమయంలో అమెరికాలో ఉన్నాడు, తరువాత అక్కడే స్థిరపడ్డాడు. ఇప్పుడు అతన్ని రాజుగా చేయాలని ఇరానియన్లు కోరుతున్నట్లు అమెరికా ప్రచారం చేస్తున్నది.
అసలు ఇరాన్‌కు అమెరికాకు ఉన్న పంచాయతీ ఏమిటన్నది అనేక మందిలో ఉన్న ప్రశ్న. రాజు షా హయాంలో 1968లో అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందం(ఎన్‌పిటి)పై ఇరాన్ సంతకం చేసింది.1979లో కొత్త ప్రభుత్వం అమెరికా వ్యతిరేక వైఖరిని అనుసరించటంతో దాన్ని ఎలాగైనా అస్థిరపరచాలని అప్పటి నుంచి పెంటగన్?, సిఐఏ చేయని కుట్రలేదు.1980 ఇరాక్?తో అమెరికా దాడులు చేయించింది. ఆ యుద్ధం ఎనిమిది సంవత్సరాల పాటు సాగింది, సద్దామ్ హుసేన్‌కు అన్ని రకాలుగా అమెరికా సాయపడింది. మరోవైపున ఎన్‌పిటి ఒప్పందాన్ని ఉల్లంఘించి అణు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఇరాన్‌పై ప్రచారం చేసింది. ఐరాస ద్వారా ఆంక్షలను విధించింది. అది చివరకు చినికి చినికి గాలి వానలా మారినట్లు ఎన్‌పిటితో తమకు సంబంధం లేదని అణు కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఇరాన్ ప్రకటించింది.
2016లో ఇదే ట్రంప్ నాయకత్వంలో ఐదు భద్రతా మండలి దేశాలు, జర్మనీ ఒక ఒప్పందం చేసుకొని క్రమంగా ఆంక్షలు ఎత్తివేస్తామని ప్రకటించాయి. అయితే 2018లో ఏకపక్షంగా ట్రంప్ ఒప్పందం నుంచి వైదొలిగి తిరిగి కయ్యానికి కాలుదువ్వాడు. మొత్తం మీద చూసినపుడు తనకు లొంగని ఇరాన్‌పై కక్ష సాధించేందుకు అమెరికా కుట్రలకు కొనసాగిస్తూనే ఉంది. తాజా పరిణామాలు దానిలో భాగమే. ముందే చెప్పినట్లు ఎప్పుడు ఇరాన్‌పై దాడి చేస్తుందో తెలియదు, అమెరికా వైఖరిని యావత్ ప్రజాస్వామిక శక్తులు ఖండించాలి. ఇరాన్ పాలకుల గతాన్ని చూసినపుడు ఇప్పుడు జరుగుతున్న అణచివేత చర్యలను వ్యతిరేకించాల్సిందే. అయితే ఆ పేరుతో అమెరికా జోక్యం చేసుకోవటాన్ని కూడా అంగీకరించకూడదు.
ఒక దేశ భవిష్యత్?ను నిర్ణయించటానికి, పాలకులను మార్చటానికి మరోదేశానికి ఎలాంటి హక్కులేదు. తేల్చుకోవాల్సింది ఇరానియన్లు తప్ప ఇతరులు కాదు !

## మనదేశంలో వ్యవసాయం తర్వాత రెండో స్థానంలో ఉన్నది చేనేత పరిశ్రమలు

నవతరం - పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గం పాతపట్నం మండలం కాగువాడ గ్రామంలో వస్త్రపురి కోలని జరిగిన ఉత్తరాంధ్ర చేనత చైతన్య సభలో పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు గౌరవ శ్రీ మామిడి గోవిందరావు గారు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, మనదేశంలో వ్యవసాయం తర్వాత రెండో స్థానంలో ఉన్నది మన చేనేత పరిశ్రమలు అని అన్నారు.ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల అభివృద్దే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే తమ బాధ్యతగా భావిస్తున్నామని,పాతపట్నం నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతుందని,ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గారు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు, మండల ఎన్డీఏ కూటమి నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గున్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**